క్లుప్తంగా

విద్యార్థికి మంత్రి అభినందన


విద్యార్థి హరీష్‌ను అభినందిస్తున్న మంత్రి లోకేష్

భోగాపురం: పదో తరగతి ఫలితాల్లో 593 మార్కులతో విశేష ప్రతిభ కనబరిచిన స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థి హరీష్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. విజయవాడలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో హరీష్‌కు షైనింగ్ స్టార్ అవార్డు అందజేసి, సత్కరించారు. ఇదే స్ఫూర్తి తర్వాతి చదువుల్లో కూడా కనబరిచి, మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు పూర్తి

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో గురువారం హనుమాన్ జయంతి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రాతఃకాలార్చన అనంతరం ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకాలు, తమలపాకులు, సింధూరంతో విశేష పూజలు చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు.

చురుగ్గా దివ్యాంగ బాలల గుర్తింపు సర్వే


ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్న ఎంఈవో పాపినాయుడు తదితరులు

పూసపాటిరేగ: మండల కేంద్రంలో దివ్యాంగ బాలల గుర్తింపు సర్వే చురుగ్గా కొనసాగుతోంది. బుధవారం జరిగిన సర్వేలో పాల్గొన్న ఎంఈవో బి.పాపినాయుడు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా బడిఈడు, దివ్యాంగ పిల్లల గుర్తింపు కోసం సర్వే చేయడం జరుగుతోందన్నారు. దివ్యాంగ బాలలకు ప్రభుత్వ పాఠశాలల్లో వారి సామర్థ్యాలకు అనుగుణంగా విద్యాబోధన చేస్తామన్నారు. రెయిలింగ్ ర్యాంప్, ఫ్రెండ్లీ టాయిలెట్ వంటి సదుపాయాలు పాఠశాలల్లో ఉన్నాయన్నారు. ప్రత్యేకావసరాలు గల పిల్లలకు అవసరమైన ఉపకరణాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 9వ తేదీ వరకు దివ్యాంగల సర్వే జరుగుతుందన్నారు.

తాగునీటి సరఫరా వేళల్లో మార్పులు

విజయనగరం: నగరంలోని కొన్ని ప్రాంతాలకు మూడు రోజుల పాటు తాగునీటి సరఫరా వేళల్లో మార్పులు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో బుధవారం వెల్లడించారు. నగరవాసులకు తాగునీరందించే మధుపాడ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద చేస్తున్న విద్యుత్ లైన్ల మార్పుల కారణంగా ఈ చర్యలు తీసుకుంటున్నామన్నారు. శుక్ర, శని, ఆదివారాలలో తాగునీటి సరఫరా వేళల్లో మార్పులు ఉండే అవకాశం ఉందని, వాస్తవానికి ఉదయం పూట నీటి సరఫరా జరిగే ప్రాంతాల్లో యథాతథంగా నీటి సరఫరా జరుగుతుందని, మధ్యాహ్నం వేళ నీటి సరఫరా జరిగే ప్రాంతాల వేళల్లో మార్పులు జరిగే అవకాశం ఉందన్నారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని పంపిణీ చేస్తామన్నారు. కంటోన్మెంట్ ట్యాంకు, బాలాజీ ట్యాంకు, కేఎల్ పురం ట్యాంకు, అయ్యన్నపేట ట్యాంకు, బీసీ కాలనీ ట్యాంకు, ఉడా కాలనీ ట్యాంకు, వీటీ అగ్రహారం ట్యాంకు, కొత్తఅగ్రహారం ట్యాంకు పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం నీటి పంపిణీ వేళల్లో మార్పు చేసేందుకు అవకాశం ఉందని, బాధిత ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని పలు ప్రాంతాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పి.త్రినాథరావు ఓ ప్రకటనలో బుధవారం వెల్లడించారు. వైఎస్సార్ నగర్, బీటీ నగర్, సత్యనగర్, రాళ్లవీధి, గాజులరేగ, కొత్తవీధి, కొండపల్లి ఏఆర్‌ఐ తోట, గాజులరేగ మెయిన్‌రోడ్డు, బుచ్చన్న కోనేరు దక్షిణం రోడ్డు ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటింగ వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగవాడ, సతివాడ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ త్రినాథరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. వ్యవసాయ విద్యుత్ లైన్ పనుల నేపథ్యంలో మధుపాడ, పినతరిమి, పెదతరిమి, బొడ్డపేట, ఒమ్మి, బొప్పడాం, వల్లూరు, మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే కొండవెలగాడ సబ్‌స్టేషన్ పరిధిలోని చిన్నబూరాడపేట, పారసాం, గెద్దపేట, గుర్ల మండలంలోని నడుపూరు, భూపాళపురం, ఆనందపురం గ్రామాలకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

ఈ-వ్యర్థాల నిర్వహణ ఏదీ?

- ప్రచారానికే పరిమితమైన ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ
- క్షేత్రస్థాయిలో కానరాని సేకరణ కేంద్రాలు
- 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం
- ప్రచారార్భాటమే తప్ప చర్యల్లేవని విమర్శలు



విజయనగరం: ప్రభుత్వం చేపట్టిన ఈ-వ్యర్థాల నియంత్రణ కార్యక్రమం ప్రచారానికే పరిమితమైంది. నగరంలో ప్రస్తుతం ఎక్కడా ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరించే కేంద్రాలు కనిపించడం లేదు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చేపట్టే ఈ-వ్యర్థాల నిర్వహణ కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి పాడైన ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లు వంటి పరికరాలను సేకరించి, పునర్వినియోగానికి పనికివచ్చేలా చేయాల్సి ఉంది. ప్రభుత్వ ఆదేశానుసారం అన్నిరోజుల్లోనూ కేంద్రాలు నిర్వహిస్తూ ఈ-వ్యర్థాల సేకరణ జరగాలి. క్షేత్రస్థాయిలో ఇది అమలు జరగకపోవడంతో కార్యక్రమ నిర్వహణపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ప్రచార ఆర్భాటానికే తప్ప అమలు ఊసేలేదని పలువురు విమర్శిస్తున్నారు.

ఈ నెల 19న ప్రారంభం..

విజయనగరంలో ఈ-వేస్ట్(వ్యర్థాలు) సేకరణ కేంద్రాలు ఈ నెల 19వ తేదీన ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణలో అత్యంత కీలకంగా భావించే ఈ-వ్యర్థాల నిర్వహణ ఒక్కరోజు తంతుగానే మిగిలిపోయింది. ఈ కార్యక్రమంపై ప్రజాక్షేత్రంలో చైతన్యం తీసుకురావడానికి ప్రజారోగ్య విభాగం చర్యలు శూన్యంగా కనిపిస్తున్నాయి. ఈ-వేస్ట్ సేకరణ కేంద్రాలు నగరంలో ఎక్కడా మచ్చుకైనా కనిపించడం లేదు. కనీసం నగరంలోని ప్రధాన జంక్షన్ల వద్దనైనా కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు లేకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రక్రియ అప్పుడే నిలిచిపోయిందా అని విమర్శిస్తున్నారు.

పేరుకుపోయిన వ్యర్థాలు..

ఐక్యరాజ్య సమితి లెక్కల ప్రకారం 2019లో 50 మిలియన్ టన్నులకు పైగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పోగయ్యాయి. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 2011 జనాభా లెక్కల ప్రకారం 3 లక్షలకు పైగా జనాభా ఉండగా 70 వేలకు పైగా అసెస్‌మెంట్‌లు ఉన్నట్లు అధికారిక సమాచారం. గడిచిన పదేళ్లలో ఒక్కో ఇంట్లో సగటున మూడేసి పనికిరాని సెల్ ఫోన్లు వ్యర్థాలుగా పడి ఉన్నాయి. పాత కంప్యూటర్ల స్థానంలో కొత్తగా ల్యాప్‌టాప్‌లు రావడంతో కొత్త వాటిని కొనుగోలు చేసి పాతవాటిని అటకెక్కించేస్తున్నారు. ఇలా కొన్ని వేల కుటుంబాల్లో రెండు కంప్యూటర్లు, మరో రెండు సీపీయూలు, మౌస్‌లు, కీబోర్డులు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు ఉన్నాయి. ఇలాంటి వ్యర్థాలను సేకరించి, పునర్వినియోగం చేస్తే పర్యావరణ హితానికి ఆస్కారం ఉంటుంది.

ప్రాంతం: విజయనగరం కార్పొరేషన్	
మొత్తం డివిజన్‌లు: 50	రోజూ సేకరించే చెత్త: 140 మెట్రిక్ టన్నులు

చెత్తాచెదారం కన్నా మరింత హాని..

ఇళ్లలో ఉండే తడి, పొడి చెత్తతో పోలిస్తే ఎలక్ట్రానిక్ వ్యర్థాలు మరింత హాని కలుగజేస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎలక్ట్రానిక్ వస్తువుల్లో ప్లాటినం, బంగారం, వెండి వంటి విలువైన లోహాలతో పాటు సీసం, తగరం, పాదరసం, ఆర్సెనిక్, కాడ్మియం, లిథియం, బేరియం వంటి భార లోహాలు కూడా ఉంటాయి. ఈ భారలోహాలు నేలను చేరితే భూసారం క్షీణిస్తుంది. జలాశయాల్లో చేరితే తాగునీరు కలుషితమవుతుంది. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు చెత్తకుప్పలోకి చేరినప్పుడు అనుకోకుండా మంట తగిలి వ్యర్థాలు దహనమవుతున్నాయి. దీంతో వాయు కాలుష్యం కూడా ఏర్పడుతోంది. తద్వారా ఆ వాయువులు పీల్చి మానవులు అనారోగ్యం బారినపడుతున్నారు. తలనొప్పి, ఛాతి నొప్పి, శ్వాసకోశ వ్యాధులు, మానసిక ఒత్తిడి, దీర్ఘకాలిక రుగ్మతలకు లోనవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

వ్యర్థాల సేకరణ కొనసాగిస్తున్నాం..

విజయనగరం పరిధిలో ఈ-వ్యర్థాల సేకరణ ప్రక్రియను కొనసాగిస్తున్నాం. స్థానిక పాలాసుపత్రి వద్ద సేకరించిన వ్యర్థాలను భద్రపరుస్తున్నాం. ప్రతిరోజూ పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే సమయంలో ఈ-వేస్ట్ వ్యర్థాలను వేరు చేసి, పాలాస్పత్రికి తరలిస్తున్నారు.

– డాక్టర్ కె.సాంబమూర్తి, ప్రజారోగ్యాధికారి, విజయనగరం కార్పొరేషన్

'యోగాంధ్ర' విజయవంతానికి ప్రణాళికలు

- జేసీ ఎస్.సేతుమాధవన్


మాట్లాడుతున్న జేసీ సేతుమాధవన్

విజయనగరం అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యోగాంధ్ర కార్యక్రమం విజయవంతానికి పటిష్ట ప్రణాళికలతో సిద్ధం కావాలని జేసీ ఎస్.సేతుమాధవన్ అధికారులను ఆదేశించారు. ఇదే విషయమై ఆయన నగరంలోని తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, కార్యక్రమ ఇన్‌చార్జ్‌లతో బుధవారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమకు అప్పగించిన విధులతో నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించుకుని దాని ప్రకారం కార్యక్రమం కొనసాగించాలని తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కార్యక్రమం పక్కాగా జరిగేలా పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో నిర్వహించే వివిధ పోటీలపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. విద్యార్థులు, యువత, మహిళలు, సామాన్య ప్రజానీకంతో పాటు ఉపాధి వేతనదారులను కూడా కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. 75 ఏళ్ల వయసు వారిని యోగాలో పాల్గొనేలా చూడాలన్నారు. జూన్ 21న యోగా దినోత్సవం రోజున జరిగే మెగా యోగా డేలో జిల్లా నుంచి అత్యధికులు పాల్గొనేలా చైతన్యం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఆర్వో మురళి, డీఆర్‌డీఏ పీడీ ఏ కళ్యాణ చక్రవర్తి, జెడ్పీ సీఈఓ బీవీసత్యనారాయణ, డీపీఓ టీ.వెంకటేశ్వరరావు, డీఈఓ మాణిక్యం నాయుడు, డీఎస్డీ వెంకటేశ్వరరావు, ఆయుష్ సీనియర్ వైద్యులు డాక్టర్ వరప్రసాద్, మెప్మా పీడీ చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం


ప్రత్యేకాలంకరణలో సీతారాములు

విజయనగరం టౌన్: నవమి పురస్కరించుకుని, స్థానిక సిటీ బస్టాండ్ వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు గాయత్రీ శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామి కల్యాణం జరగ్గా, సాయంత్రం లక్ష సింధూరార్చన చేశారు. గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా వేకువజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు కోవెళ్ల మారుతీ దీక్షా పీఠంలో స్వామి దీక్షలు తీసుకున్న స్వాములతో అభిషేకాలు, లక్ష రుద్రాక్ష పూజలు, హనుమాన్ చాలీసా పఠనం, హోమాలు వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి


విద్యార్థులకు సూచనలిస్తున్న సాహితీవేత్త సుబ్బారావు

విజయనగరం టౌన్: విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలని ఆధ్యాత్మిక, సాహితీవేత్త పీవీఎల్ సుబ్బారావు అన్నారు. స్థానిక గురజాడ స్వగృహంలో వాగ్దేవీ సమారాధనం సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉచిత వేసవి శిక్షణ తరగతులకు బుధవారం హాజరైన ఆయన..మహాకవి ఇంట శతకపద్యాలు, భగవద్గీత, నైతిక విలువలు వంటి అంశాలను నేర్చుకోవడం పూర్వజన్మ సుకృతమన్నారు. సృష్టిలో జ్ఞానమొక్కటే శాశ్వతమైందని, జ్ఞానసముపార్జన ఉన్న వారిదే అత్యున్నత స్థానం సొంతమన్నారు. అనంతరం శిక్షణ తరగతుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకురాలు పెన్నేటి స్వప్నహైందవి పాల్గొన్నారు.

రోడ్లా.. చెరువులా..!


గజపతినగరం: మెంటాడ జంక్షన్, కరూర్ వైశ్యాబ్యాంక్ సమీపంలో నిలిచిన వర్షపు నీరు


వేపాడ: చెరువును తలపిస్తున్న ముకుందపురం రోడ్డు

మేం అధికారంలోకి వస్తే రోడ్లన్నీ బాగు చేస్తామని కూటమి నాయకులు గొప్పగా చెప్పుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాదైనా రోడ్లను అభివృద్ధి చేసిన దాఖలాలు లేవు.. కొన్ని చోట్ల మరమ్మతులు చేపట్టినా నాసిరకం పనుల కారణంగా ఆ రోడ్లన్నీ పాడయ్యాయి. చిన్నపాటి వర్షానికి కూడా రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వేపాడ, గజపతినగరం, కొత్తవలస మండలాల్లో బుధవారం కురిసిన ఓ మోస్తారు వర్షానికి రోడ్లన్నీ చెరువులను తలపించాయి. కాలువలు సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీటితో పాటు కాలువ నీరు కూడా రోడ్లపైనే నిలిచిపోయింది. కొత్తవలసలో దుకాణాల్లోకి సైతం నీరు చేరిపోయింది. దీంతో వాహన చోదకులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉంటే ఈ వర్షం నువ్వు పంటను నాశనం చేస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

– వేపాడ/గజపతినగరం/కొత్తవలస


కొత్తవలస: కొత్తవలస మూడు రోడ్లు జంక్షన్‌లో షాపుల్లోకి ప్రవేశించిన వరద నీరు


కొత్తవలస: అరుకు - విశాఖ జాతీయ రహదారిలో తుమ్మికాపల్లి ఫైర్ స్టేషన్ సమీపంలో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

అద్దె చెల్లించని షాపులకు తాళాలు



విజయనగరం కార్పొరేషన్‌కు చెందిన ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లోని పలు అద్దె షాపులను అధికారులు బుధవారం సీజ్ చేశారు. పెద్దమొత్తంలో అద్దె బకాయి పడి, నోటీసులిచ్చినా డబ్బులు చెల్లించని వారి దుకాణాలకు తాళాలు వేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు నేతృత్వంలో క్షేత్రస్థాయికి వెళ్లిన అధికారుల బృందం ఈ చర్యలు తీసుకుంది. మొత్తం 18 షాపులు మూసివేయగా, ఇప్పటికైనా దుకాణాదారులు స్పందించి, అద్దెబకాయిలు చెల్లించేందుకు ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సాయిప్రసాద్, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

-విజయనగరం

అభివృద్ధికి నోచుకోని బస్‌షెల్టర్



విజయనగరం జిల్లా కేంద్రంలోని పలు బస్‌షెల్టర్లు అభివృద్ధికి నోచుకోవడం లేదు. తప్పు పట్టిన ఇనుప బెంచీలు ఓ దగ్గర.. పక్కకు ఒరిగిన బెంచీలు మరోచోట ఉన్నాయి. దీంతో వాటిపై కూర్చొని బస్సు కోసం వేచి చూసేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్‌షెల్టర్లు ఆధునీకరిస్తే సదుపాయాలు మెరుగ్గా ఉంటాయని పలువురు ఆశిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వాస్పత్రి జంక్షన్‌లో పాడైన బస్‌షెల్టర్‌ను ఈ చిత్రంలో చూడొచ్చు.

-ఫొటోగ్రాఫర్, విజయనగరం

పొంచి ఉన్న ప్రమాదం



విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్ వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల అక్కడ ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహం చుట్టూ స్టీల్ గ్రిల్స్‌తో ఏర్పాటు చేసిన కంచె, మెట్లు..అటువైపుగా ప్రయాణించే వారికి అడ్డుగా నిలుస్తున్నాయి. మూడు అడుగుల మేర రోడ్డుపైకి నిర్మాణం(స్టీల్ గ్రిల్స్ కంచె) చేసేయడంతో జంక్షన్ వద్ద రోడ్డు దాటే వాహనదారులు గందరగోళ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఏ వైపు నుంచి ఏ వాహనం వస్తుందో దగ్గరకు వెళ్తే తప్ప తెలియని పరిస్థితి నెలకొందని పలువురు అంటున్నారు. ఎప్పుడు ఏం ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

-విజయనగరం

తెలుగు భాషా పదజాలంపై అవగాహన


విద్యార్థులతో తెలుగు పదాలు రాయిస్తున్న లైబ్రేరియన్ మహేష్

డెంకాడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు తెలుగు భాషా పదజాలంపై బుధవారం అవగాహన కల్పించారు. తెలుగులోని కొన్ని పదా లు తెలిపి వాటిని పలికే విధానం, అర్థాలు, రాయడం వంటివి లైబ్రేరియన్ మహేష్ తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు ఉక్తలేఖనం(డిక్టేషన్) పోటీలు నిర్వహించారు.

సర్వేతో భూ వివాదాలు పరిష్కారం


సర్వేపై ఆరాతీస్తున్న సర్వేశాఖ అడిషనల్ డైరెక్టర్ గోవిందరావు

- సర్వే శాఖ అడిషనల్ డైరెక్టర్ ఆర్.గోవిందరావు

పూసపాటిరేగ: భూముల రీసర్వేతో రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాలు పరిష్కరించడం జరుగుతుందని సర్వే శాఖ అడిషనల్ డైరెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. మండల కేంద్రంలో జరుగుతున్న భూ సర్వేను ఆయన బుధవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. బ్లాక్‌ల వారీగా సర్వే చేసినప్పుడు వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు అందుబాటులో ఉండాలన్నారు. పక్కాగా సర్వే చేసి, రైతులకు హద్దులు తెలియజేయాలన్నారు. గోవిందపురంలో సర్వే పూర్తయిందని మండల సర్వేయరు గణపతిరావు తెలిపారు. పూసపాటిరేగలో 1278 ఎకరాలకు గాను 300 ఎకరాల్లో సర్వే జరిగినట్లు పేర్కొన్నారు. సర్వేలో గ్రామ హద్దులు గుర్తించాలన్నారు. సర్వేలో ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. ఆయన వెంట తహసీల్దారు తాడ్డి గోవింద, ఆర్ఎస్ డీటీ కల్యాణి, డీటీ రమేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి తదితరులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయనగరం
9951602843
Office mail : vzmadvt@gmail.com